అమ్మ వైభవం



పుష్కరఘాట్‌లో భవానీ భక్తుల సందడి



మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో హారతి తీసుకుంటున్న మాజీ ఎంపీ భరత్ రామ్



సత్యసాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

- దసరా మహోత్సవాలు ప్రారంభం
- కొలువు తీరిన కనకదుర్గమ్మ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- దేవీచౌక్‌లో భక్తుల సందడి

సీటీఆర్: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజక వర్గాల్లో సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో మొదటి రోజు స్వర్ణ కవచ అలంకార దుర్గాదేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. జ్ఞాన సరస్వతీ పీఠంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అమ్మను భక్తిగా పిలిస్తే పలుకుతుందని, అంతటి కరుణామూర్తి సన్నిధిలో భవానీ దీక్ష స్వీకరించడం ఆనందంగా ఉందని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆయన గోదావరి గట్టున మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో ఉన్న స్వయంభూ పార్వతి అమ్మవారి సమక్షంలో దీక్ష స్వీకరించారు. పార్వతీ మాతను బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. సారంగధరేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారు కూడా బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అక్షర కోటి గాయత్రీ చక్రపీఠంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.



ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో..



వాసవీ మాతకు సిందూరం అలంకరణ



మోరంపూడి సాయినగర్‌లో విజయ కనక దుర్గాదేవి

- భవానీ మాలధారణ స్వీకరించడానికి వచ్చిన భక్తులతో గోదావరి తీరం కిటకిటలాడింది. పుష్కర ఘాట్ వద్ద తెల్లవారుజాము నుంచే రద్దీ నెలకొంది.
- దేవీచౌక్‌లో సోమవారం రాత్రి 10 గంటలకు ప్రారంభించిన కనకదుర్గా మహాత్మ్యం నాటకం ప్రేక్షకులను అలరించింది.

కొలువుదీరిన అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను, ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరించారు.

- బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో ఆలయ ధర్మకర్త, న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. వాసంశెట్టి గణేష్, తలారి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు జరిపారు.
- జాతీయ రహదారిపై బొమ్మూరులో ఉన్న కనకదుర్గాదేవి, రాజవోలు రోడ్డులోని కనకదుర్గాదేవి, నాగదుర్గాదేవి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కొంతమూరులోని బీసీ కాలనీలోని కనక దుర్గాదేవి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.
- నగరపాలకసంస్థ పరిధిలోని 28వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నగర యువజన విభాగం అధ్యక్షుడు బిల్డర్ చిన్నా నేతృత్వంలో జరుగుతున్న వేడుకల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఆల్కాట్ తోటలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్ తోటలోని సత్యసాయి మందిరంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి దేవీనవరాత్ర ఉత్సవాలను ప్రారంభించారు. సాయి గాయత్రీ మాత చిత్ర పటానికి సేవా సమితి సభ్యులు సుబ్రహ్మణ్యం, భాస్కర్ పూజలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్య శ్యామ సుందర్, ప్రిన్సిపల్ గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: మండల కేంద్రమైన కడియంలోని దేవీ ఆలయం వద్ద ఉదయం కుంకుమ పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కడియపులంక హరిహర మహాక్షేత్రంలోని అపర్ణాదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. కడియపులంక గ్రామ దేవత పల్లాలమ్మ, దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని శారదా అమ్మవారి ఆలయాలతో పాటు మురమండ, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, కడియపుసావరం, దామిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆలయాలకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దుళ్లలో దేవీ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.



లలితా నగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు నామన వాసు ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు



బాలాజీపేట సెంటర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న గొందేశి శ్రీనివాసులురెడ్డి




28వ డివిజన్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న గిరజాల వీర్రాజు



కడియంలో దేవీ అమ్మవారిని దర్శించుకుంటున్న డీఎస్పీ భవ్య కిశోర్

- కడియంలోని దేవీ అమ్మవారిని సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిశోర్ సోమవారం రాత్రి దర్శించుకున్నారు. సీఐ వెంకటేశ్వరరావు పోలీస్ సిబ్బంది, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గుడాల చంద్రరావు, ఉపాధ్యక్షుడు మర్రి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

చాంబర్‌కు ఇద్దరు సభ్యుల నియామకం



చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఎన్నికైన సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ట్రస్ట్ నుంచి ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఎక్స్‌అఫిషియో ఉపాధ్యక్షుడిగా కనకాల రాజాను, నామినేటెడ్ ట్రస్టీగా యక్కల వీర నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ట్రస్ట్ కార్యదర్శి పచ్చిగోళ్ల సురేష్ కుమార్ సోమవారం ప్రకటించారు. మెయిన్ రోడ్డులోని చాంబర్ కార్యాలయంలో అధ్యక్షుడు తవ్వా సూర్యనారాయణమూర్తి (రాజా) అధ్యక్షత లైఫ్ ట్రస్టీల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వంటెద్దు సూరిబాబు, మాజీ అధ్యక్షులు బాలనాగు బల్లేషుగుప్తా, నందెపు శ్రీనివాస్, బూర్లగడ్డ వెంకట సుబ్బారాయుడు, లక్ష్మీనారాయణ జవ్వార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకాయమ్మపేట గ్రామస్తులు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలో ఉండడంతో తమ గ్రామం అన్ని విధాలా నష్టపోతోందని, తమకు ప్రత్యేక పంచాయతీని ఏర్పాటు చేయాలని వెంకాయమ్మపేట వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల, జిల్లా స్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు, కలెక్టర్ కార్యాలయంలో సైతం లిఖితపూర్వక అభ్యర్థనలు అందించారు. తాము ఏ విధంగా నష్టపోతున్నది అందులో పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నుంచి జేఏసీగా ఏర్పడి ఈ పోరాటాన్ని ముందుకు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. జేఏసీ నాయకులు దాసరి శ్రీనివాస్, గట్టి వెంకన్నబాబు, అయితరెడ్డి వెంకటస్వామి, రంబా దుర్గారావు, ఆకుల రాంబాబు, పులిదిండి రాజు, అయితరెడ్డి బుచ్చిరాజు, రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ప్రయోజనం

రాజమహేంద్రవరం సిటీ: జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు సోమవారం దేవీచౌక్‌లో బీజేపీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ సంస్కరణలు తీసుకు రావడం ఆనంద దాయకమన్నారు. ఇప్పుడు జీఎస్టీ 2.0 ద్వారా నాలుగు శ్లాబులున్న జీఎస్టీని రెండు శ్లాబుల్లోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, నాయకులు ఏపీఆర్ చౌదరి, క్షత్రియ బాల సుబ్రహ్మణ్యం సింగ్, హీరాచంద్ జైన్, యానాపు ఏసు తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి

వయోజనుల్లో అక్షరాస్యతను పెంచేందుకు కృషి



పెదపూడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాత్రి బడిని ప్రారంభించిన కో ఆర్డినేటర్ రాజేష్

పెదపూడి: వయోజనుల్లో అక్షరాస్యతను పెంచేందుకు అక్షర ఆంధ్ర (ఉల్లాస్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఆంధ్రప్రదేశ్ ఉల్లాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేష్ అన్నారు. పెదపూడిలోని జనార్దనస్వామి ఆలయం, సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సోమవారం అక్షరాస్యత రాత్రి బడులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేష్, జిల్లా ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్, ఉల్లాస్ స్పెషల్ ఆఫీసర్ పోశయ్య, స్టాటికల్ ఆఫీసర్ ఆనంద బాబు హాజరయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో వయోజనులను నూరు శాతం అక్షరాస్యులుగా చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మండలంలో ఇప్పటి వరకు 8 కేంద్రాలను ప్రారంభించారని, ఇంకా 180 కేంద్రాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

విజ్ఞాన సమ్మేళనంపై రేపు ప్రచార సభ

కంబాలచెరువు: భారతీయ విజ్ఞాన సమ్మేళనం కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా బుధవారం స్థానిక రాజమండ్రి రీజినల్ సైన్స్ సెంటర్‌లో ప్రచార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని సదస్సు జాతీయ కన్వీనర్, విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి సోమవారం తెలిపారు. ఈ సమ్మేళనంలో విజ్ఞాన, వ్యవసాయ, వాస్తు, ఖగోళ, ఆరోగ్య, పర్యావరణ, భాషా సంబంధ, సాహిత్య, సాంస్కృతిక వైభవాలను ప్రతిబింబించే అనేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. తిరుపతిలో డిసెంబర్ 26 నుంచి 29 వరకూ ఈ భారతీయ విజ్ఞాన సమ్మేళనం జరుగుతుందన్నారు.

కలువ పువ్వుల కోసం చెరువులో దిగి వ్యక్తి మృతి

కోరుకొండ: కలువ పువ్వుల కోసం చెరువులో దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన మండలంలోని కోటిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. సీతానగరానికి చెందిన పెంటా అప్పారావు (60) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అలాగే కలువ పువ్వులు, తామర ఆకులను సేకరించి విక్రయిస్తూ ఉంటాడు. దసరా ఉత్సవాల సందర్భంగా కలువ పువ్వులను సేకరించేందుకు ఆదివారం మధ్యాహ్నం కోటి గ్రామంలోని చెరువులోకి దిగాడు. దానిలోని ఊబిలో మునిగిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ఈ విషయాన్ని గమనించలేదు. రాత్రియినా అప్పారావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం కోటి గ్రామంలో చెరువు వద్ద గాలించారు. విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చెరువులో గాలించగా అప్పారావు మృతదేహం బయట పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై నాగార్జున తెలిపారు.

తల్లిపై కుమారుడి దాడి

బిక్కవోలు: అన్నం తక్కువ పెట్టావంటూ తల్లిపై ఓ కొడుకు దాడి చేసి గాయపర్చాడు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. బలభద్రపురం గ్రామానికి చెందిన గొర్రెల రమణమ్మకు భర్త , చిన్నకొడుకు చనిపోయారు. దీంతో పెద్ద కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి జీవిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి వచ్చిన కొడుకుకి భోజనం పెట్టింది. అయితే అన్నం తక్కువ పెట్టావంటూ ఆమెపై శ్రీనివాస్ దాడి చేసి గాయపర్చాడు. వెంటనే రమణమ్మను బంధువులు చికిత్స కోసం అనపర్తి ఏరియా ఆసుపత్రి తీసుకువచ్చారు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

సీతానగరం: మునికూడలి చెందిన నరుకుర్తి రామలక్ష్మి, ఆమె భర్తను దాడి చేసిన ఘటనలో నిందితుడు ఇందుగుమిల్లి ప్రసాద్‌కు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. ప్రసాద్‌ను ఈ నెల 21 అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం 7వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

లంచం అడుగుతున్నారని ఫిర్యాదు

సీతానగరం: పురుషోత్తపట్నంలో కౌలు కార్డులు కావాలంటే వీఆర్వో రూ.2 వేలు డిమాండ్ చేస్తున్నారని నల్లారి హరిబాబు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తికి ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బీసీ గురుకులం విద్యార్థినులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో బొమ్మూరులోని మహాత్మా జ్యోతీతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అమిత (పదో తరగతి) 1600 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ, హైజంప్‌లో ప్రథమ, 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానాలు, గాయత్రి (పదో తరగతి) షాట్‌పుట్, జావెలిన్ త్రోలో ప్రథమ, హర్షశ్రీ (పదో తరగతి) షాట్‌పుట్, జావెలిన్ త్రోలో ద్వితీయ, ఉమాదేవి(తొమ్మిదో తరగతి) షాట్‌పుట్ బ్యాక్ త్రోస్ ద్వితీయ, ఉమ(8వ తరగతి) 600 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్‌లో ద్వితీయ, నందిని (9వ తరగతి) హైజంప్, 600, 1600 మీటర్ల పరుగుపందేల్లో ప్రథమ, శ్యామల (8వ తరగతి) 600 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆ విద్యార్థినులను, పీఈటీ రమ్యను ప్రిన్సిపాల్ అఖిల, ఉపాధ్యాయులు అభినందించారు.

సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఎంతో ముఖ్యం

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఎంతో ముఖ్యమని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 20 వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. అనంతరం ఫీవర్ సర్వేపై ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎంత శాతం పూర్తయిందో అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కూడా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, రెవిన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నగరపాలకసంస్థలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని మోడల్ కాలనీకి చెందిన బత్తుల తారకరాజు (27) తన స్నేహితులతో కలిసి మూడు బైకులపై ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో రాజానగరం వైపు నుంచి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. పుల్లా గోపీనాథ్‌ డ్రైవ్ చేస్తున్న బైక్‌పై వెనుక తారక రాజు కూర్చున్నాడు. గోపీనాథ్ అతి వేగంతో డ్రైవింగ్ చేస్తూ లారీ ఢీని కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తారకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి బత్తుల కృష్ణవేణి సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

246 మందికి వైద్య పరీక్షలు

కడియం: వేమగిరి పంచాయతీ పరిధిలోని జక్కంపూడి నగర్‌లో సోమవారం 246 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యాధికారి ఎం.మణిజ్యోత్స్న తెలిపారు. ఎస్ఎన్ఎస్‌పి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించామన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు



బాపిరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్ఐ: అడవి బాపిరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఆధ్యాత్మికవేత్త అజ్జరపు హరిబాబు అన్నారు. బాపిరాజు వర్ధంతి సందర్భంగా సోమవారం సీతంపేట మాతృరూపిణి మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అడవి బాపిరాజు సాహిత్య చిత్రకళ సేవలను వక్తలు కొనియాడారు. గోదావరి ప్రాంతంలో జన్మించిన అడవి బాపిరాజు తెలంగాణకు ఎక్కువ పాత్రికేయ సేవ చేశారని తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

కంబాలచెరువు: గోదావరిలో పడి మండపేటకు చెందిన యలమంచిలి సురేంద్రకుమార్ (22) సోమవారం గల్లంతయ్యాడు. ఆ యువకుడు గోదావరిలో స్నానం చేసేందుకు రాజమహేంద్రవరంలోని పుష్కర్‌ఘాట్‌కు వచ్చాడు. స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న సులభ్ కాంప్లెక్స్ సిబ్బంది చూసి వెంటనే పోలీసులకు తెలిపారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. గల్లంతైన యువకుడి కోసం గాలిస్తున్నారు.

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

ప్రకాశం నగర్: ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో సోమవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శాప్ డైరెక్టర్ పి.రవీంద్ర బాబు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్, కార్యదర్శి బురిడి త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 115 బాలురు, 65 మంది బాలికలు ఈ ఎంపికలకు హాజరయ్యారని, వారిలో 20 మంది జిల్లా జట్లకు ఎంపిక చేశామన్నారు. వారందరూ ఈ నెల 25న విజయవాడలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు.

కరాటేలో క్రీడాకారుల సత్తా

ప్రకాశం నగర్: ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పలువురు క్రీడాకారులు సత్తా చాటి, పతకాలు సాధించారు. ఈ విషయాన్ని కరాటే మాస్టార్ పిల్లి అరుణ్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అండర్-10, 14, 17, 19 విభాగాల్లో శ్రీలాస్య, భవిష్య, గణేష్, పూజ, శ్రీ లక్ష్మీలత, లక్ష్మీభవాని బంగారు పతకాలు సాధించారు. బి.ఏంజిలరింబిక, జాన్ మలాకి వెండి పతకాలు, రోషన్, వికాస్ నారాయణ, శశాంక్, నవ్యశ్రీ, లక్ష్మీదుర్గ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో జరిగిన టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) సమావేశంలో ఆయన మాట్లాడారు. మెప్మా యాక్టివిటీ, మహిళా వికాసం యాప్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో బి.ఫణికుమార్, సీఎంఎం వి.రామలక్ష్మి, టీఎంసీ సాయి కుమార్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

యోగా శిక్షణ ప్రారంభం



యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెదపూడి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జి.మామిడాడ గ్రామానికి చెందిన యోగా గురువు సాయి వెంకటేశం అన్నారు. ఆ గ్రామంలోని సూర్యనారాయణమూర్తి దేవాలయంలో సోమవారం భాస్కర కృష్ణ చారిటబుల్ (బీకేసీ)ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయి వెంకటేశం మాట్లాడుతూ పది రోజుల పాటు శిక్షణ ఇస్తామని, విజయదశమి రోజు యోగా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మొదటి రోజు 45 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.